

# మినీకథావీధి




## చేసే కంచెను మేస్తే

ఇసుకపల్లి పురుషోత్తం

ఎగ్గిబిషను మూసివేసే టైమవటం వల్ల అనుకుంటాను బస్సులోకి ఉప్పెనలా వచ్చిపడ్డారు ప్రయాణీకులు. బస్ కెపాసిటీకి మించి ఉన్నారు ప్రయాణీకులు. అప్పటికే అటూ ఇటూ కదలటానికే ఖాళీ లేదు. కానీ బాధ్యతగల కండక్టర్ని గనుక ఎక్కిన ప్రయాణీకుల దగ్గర డబ్బులు వసూలుచేసి సరయిన టిక్కెట్టు ఇచ్చి కలెక్షను అంతా సంస్థ యాజమాన్యానికి అప్పగించాల్సిన విధి నాకుంది.

"కంచే నేను మేస్తే" సామెత తో బస్సెక్కిన ప్రయాణీకుల్ని చేననుకుంటే నేనూ, డ్రయివరూ కంచెలాంటి వాళ్ళ మన్నమాట. కనుక విధిగా ముందుకు సాగాను విధి నిర్వహణలో 'రైట్ సాబ్' అని ఓ పొలికేక పెట్టి.

"కళ్లు కనపడటం లేదా నాయనా, కాస్త చూసి నడు" గంగా భాగీరథీ సమానురాల యిన ఓ బామ్మగారి శుభాశీస్సులు. కోపం వచ్చినా సమాధానం చెప్పే ఓపికా, తీరికా రెండూ లేవు గనుక అదేమీ పట్టించుకోకుండా కర్తవ్య నిర్వహణలో నిమగ్ను డ్నయ్యాను.

"టికెట్ ప్లీజ్."

"పాస్."

"సార్. టికెట్."

"పాస్."

"టికెట్ లేలో భయ్యా."

"ఎర్రగడ్డ ఏక్."

"తంబీ టికెట్ తీసుకున్నావా?"

"పాస్" టికెట్స్ చించి యిస్తూ కష్టం మీద ముందుకు కదుల్తున్నాను.

"మాష్టారూ టికెట్ తీసుకున్నారా?"

"ఇ యస్.ఐ. 'ఒకటి" అని ముప్పై అయిదుపైసలు చేతిలో పెట్టాడామాష్టారు.

'నాంపల్లిలో ఎక్కారుగదా ఇంకా యిరవైపైసలివ్వండి.'

చిరాగ్గా చూసి తీసిచ్చాడామాష్టారు. మోతీలాల్ స్టేజీ వచ్చింది. దిగేవాళ్ళు దిగకుండానే ఓ ఐదారుగురు దూసుకొచ్చారు తుపాకీగుళ్ళలా బస్ లోపలికి.

"టికెట్ తీసుకోండి భాయ్."

'పాస్' ముక్త కంఠంతో ఒకే సమాధానం.

'చూపించండి'

'పాస్ లేకుండా ఉందని చెప్తామా?' గదమాయింపు. వాళ్ళకి తోటి ప్రయాణీకుల సమర్థింపు తోడయింది. పంజాగుట్ట కాలనీ స్టేజిలో రెండుగేట్లలో ఇద్దరు చెకింగాఫీసర్లు ఎక్కారు. టికెట్స్ చెక్ చేస్తున్నారు. ఆ సమయంలో నేను టికెట్స్ ఇవ్వకూడదు గనుక నిశ్శబ్దంగా నుంచున్నాను.

"మీ టికెట్స్ చూపించండి."

"పాస్."

"తీయండి" జేబులు వెతికి మర్చిపోయామన్నారు.

"మరి టికెట్ ఎందుకు తీసుకోలేదు." చెకింగ్ ఆఫీసరు ప్రశ్న.

"కండక్టరు ఇటు రాలేదు" అదే ముక్త కంఠంతో సమాధానం.

* * *

మర్నాడు ఛార్జి తీసుకుందామని డిపోకు వెళ్ళేసరికి ఓ కవరు నా కోసం ఎదురు చూస్తోంది. నా విధి నేను సక్రమంగా నిర్వర్తించలేదు గనక, నాలాంటి వారివల్ల సంస్థ అపారంగా నష్టపోయే ప్రమాద మున్నందు వల్ల, నన్ను సస్పెన్షన్‌లో వుంచుతున్నట్లుగా ఉత్తరువది.

* * *

'కంచే చేను మేస్తే' అంటుంటారు మన పెద్దలు.

దేశాభ్యున్నతి కోసం అహోరాత్రులూ పాటుపడవలసిన పౌరులు వీళ్ళంతా. ఈ బాధ్యతగల పౌరుల బాధ్యతారహితమైన ప్రవర్తనే ఇప్పుడు నా చేతిలో వున్న ఉత్తర్వుకి కారణం.

నేనిప్పుడు 'చేనే కంచెను మేసింది' అనాలా? అనాలేమో మరి.



### నా వివరాలు

జన్మించింది: భరతమాత స్వేచ్ఛా వాయువులు పీల్చుకొన్న ఎనిమిది సంవత్సరాల మూడు రోజులకి పొన్నూరు తాలూకా, గార్లపాడు గ్రామంలో.

విద్యాభ్యాసం: హైస్కూలు, బి. యస్.సి. పెదనందిపాడులో ఇంటర్మీడియట్, ఎమ్. ఎస్‌సి వాల్తేరులో అన్నయ్యలు, అక్కయ్యల దగ్గర.

అన్ని రంగాల్లో నాకు ప్రోత్సాహమిస్తున్నది గర్వించదగ్గ నా మిత్రులు దొప్పలపూడి కృష్ణప్రసాద్, జాష్టి సుబ్బారావులు.

తప్పుచేసి సమర్థించుకునే వాళ్ళంటే కోపం. చేసిన తప్పును ఒప్పుకొనే వాళ్ళంటే అమితమైన అభిమానం.

నా పైన నేను జోకువేసుకోగల సంస్కారముంది.

హాబీలు: పుస్తకాలు చదవటం, కేరమ్స్ ఆడటం, చుట్టూ జరిగే సంఘటనలను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించడం.

ప్రస్తుత నివాసం: చిరుద్యోగం చేస్తూ, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ, హైదరాబాదు సంజీవరెడ్డినగర్‌లో అక్కయ్య, బావలదగ్గర.

— ఇసుకపల్లి పురుషోత్తం